

66 మంది ఎస్జీటీలకు పదోన్నతి

సంగారెడ్డి అర్బన్, జూలై 2 : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా స్కూల్ అసిస్టెంట్ టీచర్ పోస్టుల్లో మిగిలిన ఖాళీలను పదోన్నతి ద్వారా భర్తీ చేసేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకున్నది. ఇందులో భాగంగా ప్రభుత్వ, స్థానిక సంస్థల యాజమాన్య పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 66 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఎస్జీటీలకు పదోన్నతి ద్వారా భర్తీకి కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు విద్యాశాఖ పదోన్నతి ఉత్తర్వులు నేడు వెలువరించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



ఉత్తమ సేవా పతకాలు పొందిన జిల్లా పోలీసు అధికారులను జిల్లా పోలీసు కార్యాలయంలో కార్యక్రమంలో అభినందిస్తున్న మెదక్ ఎస్పీ బాలస్వామి

జిల్లా పోలీసులకు సేవా పతకాలు

అంకితభావంతో విధులు నిర్వహించే ప్రతీ ఒక్కరికి గుర్తింపు : మెదక్ ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, జూలై 2: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులు రాష్ట్ర శౌర్య, మహోన్నత, ఉత్తమ, కఠిన సేవ, సేవా పతకాలకు ఎంపిక అయినట్లు ఎస్పీ బాలస్వామి తెలిపారు. 2024 నూతన సంవత్సరానికి సేవా పతకాలు పొందిన జిల్లాకు చెందిన పోలీసు సిబ్బందిని ఆయన మంగళవారం అభినందించారు. అంకితభావంతో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరికీ అవార్డులు, సేవా పతకాలు ఇచ్చి ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.

సేవ పతకాలు పొందిన అధికారులు వీరే..

సేవా పతకాలు పొందినవారిలో పోచయ్య (ఏఎస్ఐ, నార్సింగి), మల్లప్ప (తూప్రాన్ పీఎస్), ఒమర్ (హెడ్‌కానిస్టేబుల్ తూప్రాన్ పీఎస్) ఉన్నారు.

శత్రువుల నుంచి
నన్ను బతికించండి.. మీరు బతకండి..!

కార్యకర్తలతో సమావేశంలో సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూలై 2: 'శత్రువుల నుంచి నన్ను బతికించండి.. మీరు బతకండి..' అని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి కార్యకర్తలను కోరారు. ఇందుకోసం కార్యకర్తలెప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సంగారెడ్డి డివిజన్ ఆత్మ కమిటీ పాలకవర్గం బాధ్యతలు స్వీకరించింది. సంగారెడ్డి సమీపంలోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్త అర్జున్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'అన్నా నువ్వంటే నాకిష్టం.. నీ కోసం ప్రాణమైనా ఇస్తాను అని అంటావు.. కానీ నేను అరగంట క్రితం చెప్పిన పని ఇంకా చేయలేదు. నాకు నీ ప్రాణం ఎందుకు, నాకు బతుకు కావాలి, మీరు బతకండి, నన్ను బతికించండి' అని వ్యాఖ్యానించారు. దీంతో కార్యకర్తలు సరదాగా నవ్వుకున్నారు.



సంగారెడ్డిలో కాంగ్రెస్ కార్యకర్త అర్జున్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి
చిత్తశుద్ధితో కృషిచేశాం





మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ హేమలత దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు, జ్ఞాపికలతో జిల్లా పరిషత్ సభ్యులు

మెదక్ జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశంలో సభ్యుల భావోద్వేగం

సభ్యులు ప్రస్తావించిన సమస్యలు పరిష్కరిస్తా : కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, జూలై 2: 'ఐదేళ్ల పాటు సభల్లో ప్రజా సమస్యలు ప్రస్తావిస్తూ వాడివేడిగా చర్చలు జరిపాం.. చూస్తుండగానే ఐదేళ్లు గడిచిపోయాయి. ఈ ఐదేళ్లలో ప్రజా సమస్యల పరిష్కారానికి తమవంతు కృషిచేశాం'... అంటూ మెదక్ జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశంలో సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. పదవీకాలం ముగిసినప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారానికి చేయూతనివ్వాలని అధికారులను అభ్యర్థించారు. మెదక్ జిల్లా పరిషత్ పదవీకాలం రేపటితో ముగుస్తుండడంతో మంగళవారం చివరి సర్వసభ్య సమావేశం, వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఐదేళ్లలో 20 సమావేశాలు నిర్వహించాల్సి ఉండగా.. కరోనా కారణంగా నాలుగు సమావేశాలు నిర్వహించలేదు. దీంతో 16వ సమావేశంతో పదవీకాలం ముగిసింది. ఈ సందర్భంగా జడ్పీ సభ్యులు, అధికారులను.. సభకు విచ్చేసిన ప్రజా ప్రతినిధులు సన్మానించారు. అనంతరం సభ్యులందరూ గ్రూప్ ఫొటోలు దిగారు.

శాఖలవారీగా ప్రణాళికలు : కలెక్టర్

ప్రజా సమస్యలపై సభ్యులు లేవనెత్తిన అంశాలపై శాఖలవారీగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ప్రతీ శాఖకు లక్ష్యాలను నిర్దేశించి గత సంవత్సరంలో చేసిన అభివృద్ధి, చేపట్టాల్సిన పనులను చేపడతామని చెప్పారు. నర్సాపూర్ శాసన సభ్యురాలు సునీతారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్ల మరమ్మతు కోసమైనా ప్రజలను చెరువులలో నుంచి మట్టి తీయడానికి ఇరిగేషన్ అధికారులు అనుమతించడం లేదని ఫిర్యాదు చేశారు. ఘనాపూర్ ఆనకట్ట ఎత్తు పెంపు పనులు ముందుకు సాగడంలేదని, ముంపు గ్రామాల రైతులకు పరిహారం తక్కువగా చెల్లిస్తుండడంతో వారు తిరస్కరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ ఆస్పత్రుల్లో అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ నకిలీ పురుగుమందులతో రైతులు మోసపోతున్నారని పేర్కొన్నారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పలు అంశాలను లేవనెత్తారు. అనంతరం ఇరిగేషన్, పశుసంవర్ధకశాఖ, వైద్యారోగ్య, విద్యాశాఖ, వ్యవసాయశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

జిల్లా పరిషత్‌కు వన్నె తెచ్చారు

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులుగా ప్రజల సమస్యలు పరిష్కరించే సదవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని చైర్‌పర్సన్ హేమలత, జడ్పీటీసీలను ప్రశంసించారు. మరోసారి ఎన్నికల్లో గెలుపొంది జిల్లా పరిషత్‌కు రావాలని ఆకాంక్షించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ తాను కూడా ఒకప్పుడు జడ్పీటీసీగా, ఎంపీపీగా పనిచేశానని అన్నారు. కొత్త జడ్పీ కొలువు దీరేవరకు ప్రజాసమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ విరమణ పదవికే కానీ సేవలకు కాదని పేర్కొన్నారు. ప్రజల మధ్య ఉంటూ పనిచేస్తుంటే మరోసారి అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. చిత్తశుద్ధితో పనిచేస్తే అధికారులు మనం ప్రస్తావించే సమస్యలు తప్పక పరిష్కరిస్తారని అన్నారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల పదవీకాలంలో ప్రజా సమస్యలను పరిష్కరించి మంచి పేరు సంపాదించుకున్నారని అభినందించారు.

చైర్‌పర్సన్ అవకాశం అద్భుతం



జిల్లా పరిషత్ సభ్యుల కాలపరిమితి ముగిసినప్పటికీ ప్రజల సమస్యలపై అధికారులతో కలిసి పనిచేస్తామని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. జడ్పీటీసీగా ఎన్నిక కాకముందు గృహిణిగా ఉన్న తనకు జడ్పీచైర్మన్‌గా అవకాశం రావడం, ప్రజల కోసం పనిచేయడం సంతృప్తినిచ్చిందని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక పాలన తప్పదా?

నేటితో ఎంపీపీలు, రేపటితో జడ్పీల పదవీ కాలం ఆఖరు

ఇప్పటికే పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు

మెదక్, జులై 1: జిల్లా ప్రాదేశిక సభ్యులు, చైర్మన్ పదవీ కాలం రేపటితో ముగియనుంది. మండల పరిషత్‌ల పదవీ కాలం నేటితో ముగుస్తుంది. ఎన్నికలు నిర్వహించి కొత్త పాలకవర్గాలు ఎన్నికయ్యే వరకు స్థానిక సంస్థల్లో ప్రత్యేక పాలన తప్పక పోవచ్చు. పంచాయతీల పదవీకాలం ఫిబ్రవరి 2తో ముగియగా ప్రభుత్వం వాటిని పొడిగించకుండా పాలన బాధ్యతలు ప్రత్యేకాధికారులకు బాధ్యతలు అప్పగించింది. ఇదేవిధంగా జడ్పీ, ఎంపీపీల్లోనూ ప్రత్యేకాధికారులను నియమించనున్నట్లు తెలిసింది. బీసీ జనగణన చేపట్టిన అనంతరమే పంచాయతీ, జిల్లా పరిషత్, మండల పరిషత్ రిజర్వేషన్లు ఖరారు చేశాక ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తున్నట్లు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

అత్యధికులు బీఆర్ఎస్ వారే..

మెదక్ జిల్లా పరిధిలో జడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి అత్యధికంగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా పరషత్ చైర్ పర్సన్ హేమలతా శేఖర్ బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎన్నికయ్యారు. జిల్లాలో 20 మంది జడ్పీటీసీలుండగా ఇందులో 18 మంది బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందగా.. రేగోడ్, టేక్మాల్ జడ్పీటీసీలు మాత్రమే కాంగ్రెస్ పార్టీకి చెందినవారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిస్థితులు తమకు అనుగుణంగా మలుచుకున్న తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ భావిస్తున్నట్టు తెలుస్తున్నది.



ఆస్పత్రికి వెళ్లకముందు గాయాలతో గొల్లబాబు

ఆస్తి తగాదాలతో
అన్నను చంపిన తమ్ముడు

న్యాల్‌కల్ మండలంలోని మల్గి గ్రామంలో విషాదం

న్యాల్‌కల్, జూలై 2 : ఆస్తి తగాదాలతో సొంత అన్ననే కొట్టి చంపిన ఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని మల్గి గ్రామంలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను హద్నూర్ ఎస్ఐ రామానాయుడు వెల్లడించారు. గ్రామానికి చెందిన గొల్ల బాబు(50)కు తమ్ముడు వైద్యనాథ్‌తో కొంతకాలంగా ఆస్తికి సంబంధించి తగాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం అన్నదమ్ములిద్దరు గొడవపడ్డారు. ఆగ్రహంతో తమ్ముడు వైద్యనాథ్ కర్రతో అన్న గొల్లబాబుపై దాడిచేసి కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం బీదర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు చేస్తుండగా బాబు మృతిచెందాడు. మృతుడి కుమారుడు నవనాథ్ ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహానికి బీదర్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. గ్రామంలో ఉద్రిక్తతల నేపథ్యంలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశామని ఎస్సై వివరించారు.

ఆకతాయిల ఆగడాలకు చెక్..
సైలెన్సర్ రోదకు బ్రేక్

72 ద్విచక్ర వాహనాలు సీజ్

రూ. 3లక్షల విలువైన సైలెన్సర్ల ధ్వంసం

సైలెన్సర్లు మారిస్తే కేసులు : సంగారెడ్డి ఎస్పీ రూపేష్



భారీ శబ్దం చేసే బైక్ సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో తొక్కిస్తున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, జూలై 2 : విపరీతమైన శబ్ధం చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలుగజేస్తున్న బైక్‌లపై సంగారెడ్డి జిల్లా పోలీసులు మంగళవారం కొరడా ఝుళిపించారు. సైలెన్సర్లను మార్చి భారీ శబ్ధంతో రోడ్లపై తిరుగుతూ న్యూసెన్స్ చేస్తున్న 72 బైక్‌లను సీజ్ చేశారు. అతిగా శబ్దం చేసేలా అమర్చిన రూ. 3 లక్షల విలువైన సైలెన్సర్లను తొలగించి, కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై రోలర్‌తో తొక్కించారు. ఈ సందర్భంగా ఎస్పీ చెన్నూరి రూపేష్ మాట్లాడుతూ బైక్‌ల సైలెన్సర్లు మారిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కంపెనీలతో వచ్చిన సైలెన్సర్లు మాత్రమే వాడాలని సూచించారు. సైలెన్సర్లు మార్చిన మెకానిక్‌లపై కూడా క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రతీరోజు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సంగారెడ్డి జిల్లా ప్రజల సురక్షిత ప్రయాణానికి అన్ని చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ట్రాఫిక్ సిగ్నల్స్, యూటర్న్, ఫ్రీలెఫ్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తరచుగా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. పాఠశాల, కళాశాలల బస్సుడ్రైవర్లకు కూడా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్, పట్టణ సీఐ భాస్కర్, రూరల్ సీఐ అశోక్‌కుమార్, ట్రాఫిక్ సీఐ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు.. రోడ్లపైనే
పరుగు

సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన కోహీర్‌లో మురుగు రోడ్లపై పరుగు తీస్తున్నది. నెలల తరబడి డ్రైనేజీ నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇళ్లలో ఉండలేక ఖాళీ చేసి వెళ్లిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలోని జహంగీర్‌వాడ కాలనీలో సైదొద్దీన్ ఇంటి ఎదుట నెలల తరబడి మురుగు నిలిచిపోయింది. దోమలు, దుర్వాసన భరించలేక సైదొద్దీన్ ఇల్లు ఖాళీ చేసి సదాశివపేటలో అద్దెకుంటున్నాడు. అలాగే, గ్రామంలో బసంత్‌పూర్ కాలనీ రోడ్డుపై అంగన్‌వాడీ కేంద్రం ఎదుట డ్రైనేజీ నీరు నెలలుగా నిలిచిపోవడంతో తల్లిదండ్రులు పిల్లలను పంపడం లేదు. దీంతో రూ. 16 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ భవనానికి తాళం పడింది. పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

-కోహీర్ జులై 2







గవర్నర్‌తో స్పీకర్, చైర్మన్ భేటీ

హైదరాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్‌ను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్ మంగళవారం రాజ్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. గవర్నర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి కలిసిన మరుసటి రోజే శాసనమండలి చైర్మన్, శాసనసభ స్పీకర్ కలవడం చర్చనీయాంశమైంది. అయితే గవర్నర్ రాధాకృష్ణన్‌ను తాము మర్యాదపూర్వకంగానే కలిశామని శాసనసభ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ప్రాజెక్టుల నిర్వహణకు నిధులేవి?

ఏటా రూ.600కోట్లపైనే అవసరం.. ఏడు నెలలుగా నిధుల మంజూరుకు బ్రేక్

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ కోసం కొన్నాళ్లుగా నిధులు విడుదల కావడం లేదు. గత డిసెంబరులోనే కొత్త ప్రభుత్వం ఏర్పడడం, ఆ తర్వాత వరుస ఎన్నికలు రావడంతో నిధుల మంజూరుకు బ్రేక్ పడింది. ఫలితంగా పలు ప్రాజెక్టుల పరిధిలో వానాకాలంలోగానే చేపట్టాల్సిన మరమ్మతులు సైతం నిలిచిపోయాయి. ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించిన నిధుల చెల్లింపులకు గ్రీన్‌చానల్ అమలు చేయాలని ప్రతిపాదనలు వచ్చినా.. గత ప్రభుత్వం అమలు చేయలేదు. ఫలితంగా గత డిసెంబరు నుంచి ఇప్పటిదాకా రూ.100కోట్ల మేర ఓ అండ్ ఎం పనులకు సంబంధించిన బిల్లులు ఆగిపోయాయి. ఏ శాఖకు లేని విధంగా నీటి పారుదల శాఖకు కార్యదర్శి, ప్రత్యేక కార్యదర్శులు ఉన్నా... ఈ అంశంపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో 40 వరకు భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు ఉండగా 42,000 కిలోమీటర్ల మేర ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ కాల్వలు ఉన్నాయి. ఇవీ కాక 900 కిలోమీటర్ల మేర పైప్ కెనాల్ వ్యవస్థ కూడా ఉంది. 138 పంప్‌హౌస్‌లు, 115దాకా సబ్‌స్టేషన్లు(నీటిపారుదలశాఖకు ప్రత్యేకంగా కట్టిన), 1.30లక్షల కెనాల్ నిర్మాణాలు(అక్విడెక్ట్‌లు, బ్రిడ్జిలు, సైఫన్లు) ఉన్నాయి. ప్రధాన డ్యామ్‌లు, రిజర్వాయర్ల పరిధిలోని గేట్లు, జనరేటర్లు, రోప్ వైర్లకు మరమ్మతులు, లీకేజీల నివారణ, కాలువల్లో కలుపు మొక్కల తొలగింపు, దెబ్బతిన్న కాలువల మరమ్మతులు, గేట్ల పెయింటింగ్, గ్రీజింగ్.. ఇలాంటివన్నీ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం) కిందకే వస్తాయి. ఏటా వీటి నిర్వహణకు సుమారుగా రూ.600కోట్లు అవసరమవుతాయని అంచనాలున్నాయి. అయితే, గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంతోపాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికంలోనూ ఓ అండ్‌ఎం కోసం నిధులు విడుదల చేయలేదు. దాదాపు రూ.100కోట్లకుపైగా బిల్లులలు ఆగిపోవడంతో చిన్న కాంట్రాక్టర్లు విలవిల్లాడుతున్నారు.



మొహం చాటేస్తున్న పెద్ద కాంట్రాక్టర్లు

లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల వైఫల్యానికి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం) లోపమే ప్రధాన కారణమని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ తేల్చిన విషయం తెలిసిందే. నిర్వహణ పనుల ఖరీదు చిన్నదే అయినా... వాటిని విస్మరిస్తే కలిగే నష్టం వందల కోట్ల మేర ఉంటుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో అత్యంత కీలకమైన నాగార్జునసాగర్, శ్రీరామ్‌సాగర్, కడెం ప్రాజెక్టుల నిర్వహణ పనులకు టెండర్లు పిలిస్తే... బడా కాంట్రాక్టరెవరూ స్పందించలేదు. దీంతో చిన్న కాంట్రాక్టర్లతోనే పనులు చేయించాల్సిన పరిస్థితి నెలకొంది. గిట్టుబాటు కాకపోవడం, సకాలంలో చెల్లింపులు చేయకపోవడంతోనే పనులు చేసేందుకు పెద్ద కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.


అధికారాలున్నా నిధుల్లేవు

ప్రాజెక్టుల నిర్వహణ పనులను పెండింగ్‌లో పెట్టకూడదన్న ఉద్దేశంతోనే అధికారాలను వికేంద్రీకరిస్తూ నీటిపారుదల శాఖ గతంలోనే నిర్ణయం తీసుకుంది. ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) స్థాయిలో రూ.కోటి, చీఫ్ ఇంజనీర్(సీఈ) రూ.50లక్షలు, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్(ఎస్‌ఈ) రూ.25లక్షలు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) రూ.5లక్షల మేర పనులకు అనుమతులు ఇచ్చే అధికారాన్ని కల్పించింది. నిర్వహణ పనుల కోసం ప్రత్యేకంగా విభాగాన్ని, ఒక ఈఎన్‌సీతో కూడిన టీమ్‌ను ఏర్పాటు చేసింది. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టడానికి కొంత మేర నిధులను వీరి వద్ద అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. అయితే, ఇప్పుడు వీరి వద్ద ఒక్క పైసా కూడా లేదు. వీరి వద్ద నుంచి వచ్చిన బిల్లులు సైతం ఆగిపోవడం గమనార్హం. కొత్త ప్రభుత్వమైనా ఈ విధానాన్ని సంస్కరించి, ఓఅండ్‌ఎం బిల్లులను గ్రీన్‌చానల్‌లో పెట్టాలని పలువురు కోరుతున్నారు.

ఏపీలో పేదలకు ఇసుక ఉచితం!

విధివిధానాల తయారీకి సీఎం చంద్రబాబు ఆదేశం

ఎవరైనా ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకోవాల్సిందేనని వెల్లడి



అమరావతి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పేదల గృహ నిర్మాణం కోసం ఉచితంగా ఇసుక ఇవ్వాలని సర్కారు భావిస్తోంది. ఇందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. 2014-19 కాలంలో ఇసుక విధానం ఎలా ఉంది.. పేదలకు ఎలాంటి మేలు జరిగింది.. 2019-24(మే) వరకు ఇసుక అమ్మకాల విధానం ఎలా ఉంది.. ఎవరు లబ్ధిపొందారు.. ప్రభుత్వానికి జరిగిన నష్టం.. పేదలు, గృహ నిర్మాణరంగానికి జరిగిన నష్టమెంతో అంచనా వేయాలని ఆదేశించారు. మంగళవారమిక్కడ సచివాలయంలో గనుల శాఖ ఉన్నతాధికారులతో ఆయన ఇసుకపై సమీక్ష జరిపారు. జగన్ పాలనలో ఇసుక పాలసీ వల్ల పేదలు తీవ్రంగా నష్టపోయారని, గృహనిర్మాణ రంగం కుదేలైందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గృహనిర్మాణ రంగానికి ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక డంప్‌లు వైసీపీ నేతలు, ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నాయన్న సమాచారం ఉందని, ధరలను భారీగా పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సీఎం పేర్కొన్నట్లు తెలిసింది. తక్షణమే ఇసుక ధరలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా రీచ్‌లు, స్టాక్‌పాయింట్లు, డంప్‌ల పరిధిలో ఎంత ఇసుక అందుబాటులో ఉందని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతానికి దాదాపు 40 లక్షల టన్నులు అందుబాటులో ఉందని అధికారులు నివేదించినట్లు తెలిసింది. ఈ ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలని గనుల శాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను సీఎం ఆరాతీశారు ఇకపై ఆఫ్‌లైన్ ఇసుక అమ్మకాలు జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఉచిత ఇసుకతోపాటు ఇతర అమ్మకాల ద్వారా సరఫరా చేసే ఇసుకను ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకునే విధానం తీసుకురావాలని తేల్చిచెప్పినట్లు తెలిసింది. ఇందుకు అనుగుణంగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి బుధవారం సీఎంకు సమర్పించనున్నారు.

బీఆర్ఎస్‌కు మరో షాక్!

మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక కాంగ్రెస్‌లో చేరిక

మేడ్చల్ టౌన్, జూలై 2 : మేడ్చల్‌లో బీఆర్ఎస్ పార్టీకి మరోసారి గట్టి షాక్ తగిలింది. మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీమంత్రి మల్లారెడ్డికి సన్నిహితంగా ఉండే మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపికనర్సింహారెడ్డి, ఆమె భర్త మర్రి నర్సింహారెడ్డి, పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చెరువుకొమ్ము శేఖర్‌గౌడ్, కౌన్సిలర్లు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు గీత మధుకర్‌లతో కలిసి మంగళవారం మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు నక్క ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌కు చెందిన వైస్‌చైర్మన్‌తో సహా 13 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరిన విషయం విదితమే. తాజాగా మిగిలిన ఆరుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లలో ప్రస్తుతం చైర్‌పర్సన్‌తో సహా ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. చైర్‌పర్సన్‌ను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కొంతమంది కౌన్సిలర్లకు ఈ పరిణామం ఇబ్బందికరంగా మారింది. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టడానికి గత కొద్ది రోజులుగా ప్రయత్నాలు చేస్తున్న కౌన్సిలర్లకు చెక్ పెట్టడానికే చైర్‌పర్సన్ దీపిక కాంగ్రెస్‌లో చేరినట్టు ప్రచారం జరుగుతోంది. చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి భర్త మర్రి నర్సింహారెడ్డికి మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్‌లతో ఉన్న పరిచయాలు పార్టీ మారేందుకు కలిసొచ్చాయి.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ఐదుగురు మావోయిస్టుల మృతి

చర్ల, జూలై 2: దండకారణ్యంలో ఎన్‌కౌంటర్ల పరంపర కొనసాగుతూనే ఉంది. వరుస ఘటనల్లో భారీ సంఖ్యలో మావోయిస్టులు మరణిస్తున్నారు. తాజాగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అడవుల్లో మంగళవారం ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఘటనా స్థలంలో మావోయిస్టులకు చెందిన తుపాకులు, మందుపాతరలు, ఇతర సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజన్ తెలిపారు. నారాయణపూర్ జిల్లా ఘమడి, కుర్రేవాయి గ్రామాల పరిధిలో అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టుల సంచారం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాంతో నారాయణపూర్, కొండెగావ్, కాంకేర్, దంతెవాడ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్ బెటాలియన్ల నుంచి మొత్తం 1,400 మంది జవాన్లు సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. నాలుగు జిల్లాల సరిహద్దుల నుంచి అబూజ్‌మడ్‌లోకి ప్రవేశించారు. ఈ క్రమంలో ఘమడి, కుర్రేవాయి గ్రామాల మధ్య మావోయిస్టులు తారసపడడంతో ఇరు పక్షాల నడుమ కాల్పులు చోటుచేసుకున్నాయి. ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని ఐజీ తెలిపారు. పోలీసులకు ఎలాంటి గాయాలు కాలేదన్నారు. కాగా, తప్పించుకున్న మావోయిస్టులు అడపాదడపా కాల్పులు జరుపుతున్నట్టు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం గుట్టల్లో ఉండడంతో మృతదేహాల తరలింపు ఆసల్యమవుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది జనవరి నుంచి బస్తర్ డివిజన్‌లోని 7 జిల్లాల్లో తుపాకుల మోత మోగుతోంది. వరుస ఘటనలతో బస్తర్.. వార్ జోన్‌గా మారింది. ఇప్పటి వరకు జరిగిన 9 ఎన్‌కౌంటర్లలో 136 మంది మావోయిస్టులు మృతిచెందారు. కాగా.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట మంగళవారం ఇద్దరు మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఒకరు మహిళ, మరొకరు పురుషుడు ఉన్నారు. కుంట ఏరియా కమిటీలో 20 ఏళ్లుగా వీరు పనిచేశారని ఎస్పీ తెలిపారు.

ఈడీ విచారణకు హాజరైన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మంగళవారం ఈడీ విచారణకు హాజరయ్యారు. అక్రమ మైనింగ్ కేసులో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిపై మనీలాండరింగ్ అభియోగాలు ఉన్నాయి. కేసు దర్యాప్తులో భాగంగా విచారణకు హాజరు కావాలని మహిపాల్ రెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి వెళ్లిన మహిపాల్ రెడ్డి అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. మహిపాల్ రెడ్డిని విచారించిన అధికారులు ఆయన స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఆయన సోదరుడు మధుసూధన్ రెడ్డి కలిసి సంతోష్ శాండ్ అండ్ గ్రానైట్ సప్లయ్ అనే సంస్థ ద్వారా అక్రమ మైనింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు సంబంధించి మహిపాల్ రెడ్డి, మధుసూధన్ రెడ్డి ఇళ్లు, కార్యాలయాలు సహా పది చోట్ల జూన్ 20న ఈడీ అధికారులు సోదాలు చేశారు. ఎమ్మెల్యే సోదరులు అక్రమ మైనింగ్‌తో రూ.300 కోట్లు కూడబెట్టారని ఈడీ అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే.

అసైన్డ్ భూములు తారుమారు



మునిదేవుపల్లిలో అసైండ్ భూమిలో గోంగూర, కంది పంటసాగు



తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతులు ఇల్టెపు లక్ష్మయ్య, బేగరి కిష్టయ్య

ఆన్‌లైన్ రికార్డు తప్పులతో రైతులకు తిప్పలు

- కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోని అధికారులు
- అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న రైతులు

కొండాపూర్, జూలై 2: అధికారుల నిర్లక్ష్యంతో కోట్లు విలువ చేసే అసైండ్ (ప్రభుత్వ) భూములు తారుమారయ్యాయి. సాగుచేస్తున్న రైతుల భూములు ఆన్‌లైన్ నమోదులో తప్పులు దొర్లి రైతులు తిప్పలు పడుతున్నారు. 2017లో జరిగిన భూ ప్రక్షాళన ధరణి పట్టా పాస్ పుస్తకాలను 2018-19లో రైతులకు రెవెన్యూ అధికారులు అందజేశారు. కానీ ఆన్‌లైన్ రికార్డు నమోదులో తప్పులు దొర్లాయనితహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మునిదేవుపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 92లో ఇల్టెపు కిష్టయ్యకు మూడెకరాలు, కుమ్మరి నర్సింహులుకు మూడెకరాల అసైన్డ్ భూమి ఉన్నది. ఖస్రా, కబ్జా కాలం నాటి నుంచి తాత, తండ్రి వారి అధీనంలో సాగుచేస్తున్నారు. 2017 భూప్రక్షాళనలో వారికి కొత్త పాసు పుస్తకాలు అందలేదు. దాదాపు ఐదేళ్లుగా ఆఫీసులు, అధికారుల చుట్టూ తిరిగినా ఆన్‌లైన్, ధరణి పట్టా పాసు పుస్తకాలు అందలేదు. సిహెట్ కొనాపూర్ గ్రామానికి చెందిన బేగరి పర్మయ్య తండ్రి రత్నయ్యకు 40, 54, 180 సర్వే నంబర్లలో 2 ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నది. పట్టాదారు చనిపోవడంతో.. అదే గ్రామానికి చెందిన బేగరి పర్మయ్య తండ్రి సాయన్న వారసులకు రెవెన్యూ అధికారులు పౌతి మార్పిడి చేశారు. అప్పటి నుంచి బాధితులు అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేసినా.. ఆన్‌లైన్‌లో వారికి నమోదు కాలేదు.

అసైన్డ్ భూమిని ఆన్‌లైన్‌లో మార్పు..

మన్‌సాన్‌పల్లిలో సర్వే నంబరు 192లో టీడీపీ ప్రభుత్వం (ఎన్టీఆర్ హయాం)లో రైతులకు భూ పంపిణీ చేసింది. అందులో మందుల ఆంజనేయులుకు రెండు ఎకరాల భూమి సర్టిఫికెట్‌ను రెవెన్యూ శాఖ ఇచ్చింది. ఆ భూమిని హైదరాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పహాణి రికార్డులో నమోదు చేసి అధికారులు ఆన్‌లైన్ చేశారు. మల్కాపూర్ రెవెన్యూ కుతుబ్‌షాయిపేటలో 16, 20 సర్వే నంబర్‌లో రూ.కోట్లు విలువల చేసే ప్రభుత్వ భూములు నోటరీ పద్ధతిలో క్రయవిక్రయాలు జరిగాయి. వ్యవసాయ సాగు భూమిగా.. చూపుతూ కోళ్లఫాం, పండ్ల తోటలతో వ్యాపార లావాదేవీలు జరుపుతున్నారు. ప్రభుత్వ భూమిని అమ్మినా.. కొన్నా.. చట్టరీత్యా నేరమన్న అధికారులు.. పౌతి, పట్టా మార్పిడి వలే రికార్డు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం

తెలంగాణ ప్రభుత్వం భూ ప్రక్షాళన పేరుతో సాగుచేస్తున్న భూమిని ఆన్‌లైన్ నమోదు చేయకుండా అధికారుల తప్పిదం వల్ల ధరణి పాస్‌బుక్ అందక రైతుబంధు కోల్పోయాం. తాత, తండ్రి కాలం నుంచి సాగులో ఉండి జీవనోపాధి పొందుతున్నాం.. ఏ అధికారి దగ్గరకు వెళ్లినా క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేస్తామంటూ ఐదేళ్లు గడిచిపోయింది. కార్యాలయాల చుట్టూ తిరిగి అప్పులపాలయ్యాం. అధికారులు స్పందించి తమ సాగు భూమిని ఆన్‌లైన్‌లో చేర్చాలి.

\- ఇల్టెపు లక్ష్మయ్య, రైతులు, మునిదేవునిపల్లి

తమ పరిధిలోని పనులను సత్వరమే పరిష్కరిస్తాం

తమ అధీనంలో అయ్యే పనులను సత్వరమే పరిష్కరిస్తున్నాం. మునిదేవునిపల్లి అసైండ్ భూమిలో రైతులకు అక్కడున్న భూమి ఎక్సెస్‌లో ఉంది. మల్కాపూర్, మాన్‌సాన్‌పల్లిలో భూముల్లో అప్పటి రికార్డు తమకు తెలియదు.అయినా ఆ భూములపై కోర్టులో కేసు నడుస్తుంది.ప్రభుత్వ భూముల్లో చట్ట వ్యతిరేక పనులు చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

\- ప్రదీప్, డిప్యూటీ తహసీల్దార్

కోహెడలో ధరణి ఉద్యోగుల మాయాజాలం

● రైతు ప్రమేయం లేకుండానే వేరొకరికి పట్టా!



తహసీల్దార్ కార్యాలయం ఎదుట గోడు వెళ్లబోసుకుంటున్న బాధిత రైతు కుటుంబం

కోహెడ, జూలై 2: వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, తక్షణ మ్యుటేషన్ కోసం తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన ధరణి వెబ్‌సైట్‌లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ధరణి ఉద్యోగుల మాయాజాలంతో రైతులకు తెలియకుండానే పట్టా మార్పులు జరుగుతున్నాయి. కోహెడ మండలంలోని చెంచల్ చెరువుపల్లి గ్రామానికి చెందిన జేరిపోతుల కనకవ్వకు 1993-94లో కోహెడ శివారులో సర్వే నంబర్ 971-10లో ఎకరం 07 (1-07) గుంటల వ్యవసాయ భూమిని ప్రభుత్వం ఇచ్చింది. ధరణిలో పాస్‌బుక్ టీ నంబర్ (టీ 10100081029) ఖాతా నంబర్ 1,734 కేటాయించారు. ఈ ధరణి పాస్‌బుక్ మారి కొత్త పాస్‌బుక్ కూడా వచ్చింది. కనకవ్వకు ఉన్న 1.07 గుంటల భూమిని ములవాత్ నాగేంద్ర నాయక్ పేరిట రెవెన్యూ అధికారులు మార్చారు. ఈ విషయమై తహసీల్దార్ సురేఖను వివరణ కోరగా.. మా వద్ద ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. రెవెన్యూ అధికారులే కుమ్మక్కై తమ భూమిని కాజేయడానికి కుట్రలు చేశారని బాధిత రైతు ఆరోపిస్తున్నారు. దీంతో మంగళవారం కుటుంబంతో సహా వచ్చి తహసీల్దార్ కార్యాలయం ఎదుట తమ గోడను వెళ్లబోసుకున్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధురాలు మృతి

మిరుదొడ్డి, జూలై 2: ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పర్శ బీరవ్వ(95) గ్రామంలోని చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లింది. కాగా చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందింది. స్థానికులు, కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం మృతదేహాన్ని నిమిత్తం దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి



మృతిచెందిన లేగదూడ

చేగుంట, జూలై 2: చిరుతదాడిలో లేగదూడ మృతి చెందిన సంఘటన చేగుంట మండలం రాంపూర్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన గుగులోత్ శంకర్ అటవీ ప్రాంతంలోని తన వ్యవసాయ పొలాల వద్ద పాకలో పశువులను కట్టేశాడు. మంగళవారం ఉదయం వచ్చిచూసేసరికి దూడ లేకపోవడంతో పాటు పశువుల పాక చుట్టూ రక్తం, ఎముకల మాంసం ఉండడంతో అటవీ అధికారులు సమాచారం అందించాడు. తూప్రాన్ అటవీ సెక్షన్ ఆఫీసర్ కిరణ్‌కుమార్ గ్రామానికి చేరుకుని పశువుల పాక చుట్టూ పాదాల గుర్తుల ఆధారంగా వెళ్లారు. సమీప అటవీ ప్రాంతంలోని కుంటకట్ట దగ్గర పొదల్లో లేగదూడ మృతదేహం కనిపించింది. లేగదూడపై దాడి, పాదాల గుర్తులు, చిరుత ఆనవాళ్లేనని తెలిపారు. అనంతరం లేగదూడ మృతదేహానికి పశువుల డాక్టర్‌తో పోస్టుమార్టం నిర్వహించామన్నారు. ఈ ప్రాంతంలోని చుట్టుపక్కల రైతులు వ్యవసాయ పొలాల వద్ద పశువులను కట్టేయొద్దని, రాత్రివేళలో పొలానికి వెళ్లొదని సెక్షన్ ఆఫీసర్ కిరణ్ కుమార్ సూచించారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

● పన్యాలలో మూడిళ్లలో చోరీ ● పోలీసులు, క్లూస్ టీం పరిశీలన

హత్నూర, జూలై 2: తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేసిన దొంగల ముఠా.. పలు ఇళ్ల తాళాలు పగులగొట్టి, రెండు ఇళ్లలో చోరీకి పాల్పడి నగదు, నగలు అపహరించుకుపోయారు. ఈ సంఘటన హత్నూర మండలం పన్యాల గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన గంటబోయిన వీరమణి, భర్త అంజయ్య, చుట్టాకుల గంగమ్మ, భర్త మొగులయ్య, తలారి రుక్కమ్మ, భర్త మల్లయ్య మూడు కుటుంబాలు బంధువుల ఇంటికి వెళ్లారు. దీన్ని అదునుగా భావించిన గుర్తు తెలియని దొంగలు ఏకకాలంలో మూడు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో మంగళవారం ఉదయం ఇంటికొచ్చి చూడగా.. చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. గంటపోయిన వీరమ్మ ఇంట్లో తులం బంగారం నగలు, 10 తులాల వెండి నగలు, చుట్టాకుల గంగమ్మ ఇంట్లో వెండి, బంగారం నగలు అపహరించుకుపోయారు. తలారి రుక్కమ్మ ఇంట్లో బట్టలు, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుభాష్ తెలిపారు. మంగళవారం మూడు ఇళ్లలో సంగారెడ్డి క్లూస్‌టీం బృందం వేలిముద్రల నమూనాలను సేకరించారు. సంఘటనా స్థలాన్ని జిన్నారం సీఐ సుధీర్‌కుమార్, ఎస్‌ఐ సుభాష్ పరిశీలించారు.

వీరభద్రస్వామి ఆలయంలో చోరీ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

టేక్మాల్, జూలై 2: టేక్మాల్ మండలం బొడ్మాట్‌పల్లి గ్రామంలోని వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. అర్ధరాత్రి వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఆలయంలోని హుండీని పగులగొట్టే ప్రయత్నం చేశారు. అనంతరం గుడి తలుపులు పగులగొట్టి.. అమ్మవారి మంగళ సూత్రం, ముక్కుపుడక ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు దొంగతనం జరిగిందని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారమందించారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థల్నాన పరిశీలించారు.

రూ.35 వేల గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

నర్సాపూర్, జూలై 2: నర్సాపూర్ పట్టణంలో పలుచోట్ల పోలీసులు సోదాలు చేసి రూ.35 వేల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిషేధిత గుట్కా, పాన్ మసాలాలు విక్రయిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు పట్టణంలో పలు చోట్ల సోదాలు చేయగా రూ.35 వేల విలువ చేసే గుట్కా ప్యాకెట్లు లభించినట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఏడుపాయల ఈవోగా కృష్ణప్రసాద్..?

పాపన్నపేట, జూలై 2: ఏడుపాయల ఈవోగా కృష్ణప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏడుపాయల సిబ్బంది ద్వారా తెలియవచ్చింది. గతంలో ఏడుపాయల ఈవోగా, ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 15 రోజుల క్రితం ఏడుపాయల ఈవోగా వచ్చిన వినోద్‌రెడ్డి, వేములవాడ ఈవోగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏడుపాయల ఈవోగా కృష్ణప్రసాద్‌ను నియమించగా.. నేడు బాధ్యతలు స్వీకరిస్తారని ఉద్యోగస్తులు, దేవాదాయ సిబ్బంది పేర్కొన్నారు.

పద్మశ్రీ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి అర్బన్, జూలై 2: గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా పద్మశ్రీ పురస్కారాలకు ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఈ నెల 31వ తేదీలోగా పద్మశ్రీ అవార్డ్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారానికి దరఖాస్తులు

సంగారెడ్డి అర్బన్, జూలై 2: చేనేత దినోత్సవం (ఆగస్టు 7)న పురస్కరించుకొని కొండాలక్ష్మణ్ బాపూజీ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత, జౌళి శాఖ జిల్లా సహాయ సంచాలకురాలు విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత కళాకారులు, చేనేత డిజైనర్లకు వృత్తిలో నైపుణ్యం, ప్రత్యేకతల ఆధారంగా పురస్కారాలు అందిస్తామని పేర్కొన్నారు. రూ.25 వేల నగదు, చేనేత శాలువా, జ్ఞాపిక అందించి మెరిట్ సర్టిఫికేట్‌తో సత్కరిస్తామని తెలిపారు. 2023 డిసెంబరు నాటికి 30 ఏళ్ల పైబడి, పదేళ్లకు తగ్గకుండా అనుభవమున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 10వ తేదీలోగా సంగారెడ్డి కలెక్టరేట్‌లోని చేనేత జౌళిశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

రేపు గెస్ట్ టీచర్ల భర్తీకి డెమో

సంగారెడ్డి అర్బన్, జూలై 2: సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాలలో తాత్కాలిక పద్ధతిలో ఉపాధ్యాయుల భర్తీకి ఈ నెల 4న డెమో నిర్వహించనున్నట్లు ఆర్‌సీవో భీమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, భౌతిక, రసాయన, వృక్ష, జీవశాస్త్రం, సాంఘీక, వాణిజ్యశాస్త్రం, వ్యాయామ, లైబ్రేరియన్, స్టాఫ్‌నర్సుల పోస్టులకు అర్హతలున్న వారు తమ బయోడేటా, ధ్రువపత్రాలతో ఇస్నాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలకు ఉదయం 10 గంటల వరకు హాజరుకావాలని ఆయన కోరారు.



ఏకరూప దుస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

నిబంధనలకు అనుగుణంగానే లేఅవుట్లు ఏర్పాటు చేయాలి

● సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

జోగిపేట, జూలై 1: డీటీసీపీ నిబంధనలకు అనుగుణంగానే లేఅవుట్లను ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం జోగిపేటలోని పలు లే అవుట్లను పరిశీలించి, మాట్లాడారు. నిబంధనలకు అనుగుణంగానే లేఅవుట్లను నిర్మించాలని, అతిక్రమిస్తే బాగుండదని సూచించారు. అనంతరం అందోల్, జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డులో ఏకరూప దుస్తులను పరిశీలించి, వాటి నాణ్యతను గమనించారు. కుట్టు తీరును, బటన్ల ఏర్పాటును ఆయన దగ్గరుండి పర్యవేక్షించి సంతృప్తి చెందారు. అతి త్వరలో కుట్టుపని పూర్తిచేసి విద్యార్థులకు యూనిఫామ్‌లను అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఆర్డీవో పాండు పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

● 12 కిలోల 150 గ్రాముల విత్తనాలు స్వాధీనం



నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసిన బేగంపేట పోలీసులు

వర్గల్, జూలై 2: రైతులకు నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న వ్యక్తులను బేగంపేట పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. బేగంపేట ఎస్‌ఐ భువనేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం బొర్రగూడెం పరిధిలోని చందాపూర్‌లో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు మండల వ్యవసాయాధికారులు, బేగంపేట పోలీసులు మూకుమ్మడిగా వెళ్లి ఏంజెల్ అనే వ్యక్తిని పట్టుకున్నారు. దీంతో అతను కాస స్వామి, కరీముద్దీన్ అనే రైతులకు విత్తనాలను విక్రయించినట్లు తెలిపాడు. వారి నుంచి 12 కిలోల 150 గ్రాముల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాలకు తప్పకుండా రసీదు పొందాలని, నకిలీ విత్తనాలని అనుమానం వస్తే వ్యవసాయాధికారులకు కానీ, పోలీసులకు కానీ సమాచారమందించాలని మండల వ్యవసాయాధికారి శేషశయణ తెలిపారు.

గ్రామపంచాయతీ కార్మికుల భిక్షాటన

● మూడునెలలుగా వేతనాలు లేక అవస్థలు



జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లిలో భిక్షాటన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

జగదేవ్‌పూర్, జూలై 2: గ్రామపంచాయతీలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని మునిగడప, పలుగుగడ్డ, జంగంరెడ్డిపల్లె, ధర్మారం తదితర గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు మంగళవారం భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడునెలలు గడుస్తున్నా జీతాలు రాకపోవడంతో చేసేది లేక భిక్షాటన చేపట్టినట్లు తెలిపారు. తమ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కావడం లేదన్నారు. నెలలు గడుస్తున్నా వేతనాలు లేక కుటుంబం గడవని పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు లేకపోవడంతో విధులను నిర్వహిస్తూనే అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలకు సంబంధించిన నిధులను విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

మట్టి అక్రమ రవాణాపై రగిలిన గొడవ

● తడి బట్టలతో ఆలయంలో ప్రమాణం చేసిన కాంగ్రెస్‌లోని ఓ వర్గం



తడి బట్టలతో ప్రమాణం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రామాయంపేట, జూలై 2: అడిగిన డబ్బులు ఇవ్వనందునే మట్టి అక్రమ రవాణా అడ్డుకున్నారని కాంగ్రెస్‌లోని ఓ వర్గం ఆరోపించగా.. అదే నిజమైతే తడి బట్టలతో అమ్మవారి ఆలయంలో ప్రమాణం చేద్దామన్న సవాల్‌కు మరో వర్గం కట్టుబడింది. ఈ మేరకు మంగళవారం తమపై తప్పుడు విమర్శలు చేసిన వారిని నాశనం చేయాలంటూ పట్టణంలోని మహంకాళి అమ్మవారిపై ఒట్టు వేసి వేడుకున్నారు. పట్టణంలోని మల్లెచెర్వు నుంచి రెండ్రోజుల క్రితం వేలాది ట్రాక్టర్ల ద్వారా మట్టిని అమ్ముకున్నారు. రైతు పొలాల్లోకి తరలిస్తే తప్పు లేదు కానీ.. ఎలాంటి అనుమతి లేకుండా నల్ల మట్టిని అమ్ముకోవటం ఏమిటంటూ కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్ రజనీకి ఫిర్యాదు చేశారు. ఆమె రంగంలోకి దిగి మట్టి తరలింపును నిలిపి వేయించారు. దీంతో కాంగ్రెస్‌లోని రెండు వర్గాల మధ్య విభేదాలు పెచ్చుమీరాయి.

కల్హేర్‌లో వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

కల్హేర్, జూలై 2: మండల కేంద్రమైన కల్హేర్‌లో సీతారాముల కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. రామాలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా మొదట అభిషేకం, ప్రత్యేక అలంకరణ, హారతి, అష్టోత్తర సహస్ర కలశ కుంభాభిషేకం, పుణ్యాహవచనం, హోమం, కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవానికి స్థానికులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కల్హేర్ ఎంపీటీసీ సంగప్ప, డీసీసీబీ డీసీఎం నారాయణరెడ్డి, కల్హేర్ పీఏసీఎస్ చైర్మన్ గంగారెడ్డి, మాజీ చైర్మన్లు వీరశెట్టి, కరణం సంగమేశ్వర్‌రావ్, మాజీ సర్పంచులు లచ్చవ్వ బాలయ్య, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనీమియా నిర్మూలించి.. జీవితాలను చక్కదిద్దుకుందాం

● గిరిజన అభివృద్ధి జిల్లా అధికారి పిరంగి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి పిరంగి, హాజరైన విద్యార్థులు

పుల్‌కల్, జూలై 2: సికిల్ సెల్ అనీమియా వ్యాధిని నిర్మూలించి.. జీవితాలను చక్కదిద్దుకోవాలని సంగారెడ్డి జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి పిరంగి అన్నారు. చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో బుధవారం అనీమియా వ్యాధి నిర్మూలన పట్ల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సికిల్ సెల్ అనీమియా వ్యాధిని కలిసికట్టుగా ఎదుర్కొవాలని సూచించారు. ఇందుకు ఆరోగ్య ఉపకేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ప్రత్యేక శిబిరాల్లో కూడా పరీక్షలు నిర్వహించేందుకు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఆశ్రమ వసతి గృహ అధికారి శోభ, పుల్కల్ పీహెచ్‌సీ డాక్టర్ సాయికిరణ్, గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్, ఆరోగ్య సిబ్బంది మహేశ్‌బాబు, వెంకటరాములమ్మ, కిషన్, సృజనమ్మ, సేవంత తదితరులు పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న ఇసుకకు వేలం

● దక్కించుకున్న ఇసుక మాఫియా



రామాలయం గుడి వద్ద ఇసుక వేలంలో పాల్గొన్న అధికారులు, హాజరైన ఇసుక వ్యాపారులు

నంగునూరు, జూన్ 2: స్వాధీనం చేసుకున్న ఇసుకను పోలీసులు, రెవెన్యూ అధికారులు మంగళవారం వేలం వేశారు. ఇటీవల ఇసుకను అక్రమంగా తరలిస్తూ ఇసుక మాఫియా వ్యాపారులు పెద్దఎత్తున డంప్ చేశారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీయడంతో స్పందించిన అధికారులు, పోలీసులు డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇసుకను వేలం వేశారు. కాగా అక్రమంగా నిలువచేసిన సదరు వ్యక్తులే వేలంలో పాల్గొనడం గమనార్హం. ఇసుక అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులు వేలం పాటలో పాల్గొన్నారంటే ఎంత లాభాలు పొందుతున్నారో అర్థమవుతుంది. వివిధ ప్రాంతాల్లో అక్రమంగా నిల్వచేసిన 190 ట్రిప్పుల ట్రాక్టర్ల ఇసుకను వేలం ద్వారా విక్రయించారు. వేలంలో మూడు లక్షల 57 వేల 102 రూపాయలు వచ్చాయి. వేలం పాటలో ఆర్‌ఐ లింగం, ఏఎస్‌ఐ బాకీ పాల్గొన్నారు. వేలంపాటలో పాల్గొన్న వ్యక్తులు 50 శాతం డబ్బులు డిపాజిట్ చేయగా.. మిగతా డబ్బులు అనుమతులు పొందేటప్పుడు చెల్లించాలని సూచించామని అధికారులు తెలిపారు. వచ్చిన డబ్బులను త్వరలోనే సంబంధితశాఖ ఖజానాలో జమ చేస్తామన్నారు. ఇసుక వేలం వేస్తున్నారని సమాచారం తెలుసుకున్న సిద్దిపేటకు చెందిన అవసరం ఉన్న కొంతమంది వేలంపాట వద్దకు రాగా.. వారిని ఇసుక మాఫియా అడ్డుకొని పంపించినట్లు సమాచారం.

ధరణి సమస్యలను త్వరగా పరిష్కరించాలి



రేగోడు: ఆర్ ఇటిక్యాలలో ఇనాం భూములను పరిశీలిస్తున్న మెదక్ ఆర్డీవో

అల్లాదుర్గం/పెద్దశంకరంపేట/రేగోడ్, జూలై 2: రైతులకు ఇబ్బందులు కలగకుండా ధరణిలో నెలకొన్న పలు సమస్యలను త్వరగా పరిష్కరించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అధికారులను ఆదేశించారు. మంగళవారం అల్లాదుర్గం, పెద్దశంకరంపేట మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీసేవ ద్వారా వచ్చే వివిధ ధ్రువపత్రాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వీలైనంత త్వరగా జారీ చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను, కల్యాణలక్ష్మీ చెక్కులకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో ఆయా మండలాల తహసీల్దార్‌లు, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా రేగోడు మండలంలోని ఆర్ ఇటిక్యాల గ్రామంలో ఇనాం భూములను ఆర్డీవో పరిశీలించారు. ఇనాం భూముల లబ్ధిదారుల రికార్డులను పరిశీలించారు. వెంట తహసీల్దార్ బాలలక్ష్మి, ఆర్ఐ ఫిరోజ్ తదితరులు ఉన్నారు.

పిల్లలు ఎత్తుకు తగ్గ బరువుండేలా చూసుకోవాలి

- సంగారెడ్డి జిల్లా సంక్షేమ అధికారి
- అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన

కంది, జూలై 2 : పిల్లలు ఎత్తుకు తగ్గ బరువుండేలా చూసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి సూచించారు. కంది మండలం కాశీపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన పోషణ్ అభియాన్ భాగంగా నిర్వహించిన ఎత్తు, బరువు మేళా కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. అంగన్‌వాడీలో 0-5 సంవత్సరాల లోపు ఉన్న పిల్లల పోషణ స్థితిని నిర్ధారించడానికి ఎత్తు, బరువులను పరీక్షించారు. ఈ సందర్భంగా లలితకుమారి మాట్లాడుతూ ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లలను గుర్తించి వారికి సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

- మునిపల్లి : అంగన్‌వాడీల్లో పిల్లలకు నాణ్యతతో కూడిన విద్య అందించాలని సంగారెడ్డి జిల్లా ఐసీడీఎస్ పీడీ లలితాకుమారి ఆదేశించారు. నూతన విద్యా విధానంపై మంగళవారం మునిపల్లి మోడల్‌స్కూల్‌లో అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ లలితా కుమారి మాట్లాడుతూ చిన్నారులకు సులభంగా బోధించడం, ఆటపాటలతో చదువు చెప్పడం, సిలబస్ ప్రకారం కథలు, పాటలు తదితర అంశాలపై టీచర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీ రేణుక, పోషణ్ అభియాన్ కో ఆర్డినేటర్ సౌమ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శైలజ, నాగమణి, జయలక్ష్మి, విమల, అజీమ్ ప్రేమ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



మునిపల్లి మోడల్‌స్కూల్‌లో అంగన్‌వాడీ టీచర్ల సదస్సులో మాట్లాడుతున్న పీడీ లలితాకుమారి

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

సంగారెడ్డి రూరల్, జూలై 2: విద్యతోనే బాలికలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి పేర్కొన్నారు. సంగారెడిలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం అధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బేటీ పడావో - బేటీ బచావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర విషయాలను గ్రహించాలన్నారు. అదే విధంగా భారతీయ న్యాయ సంహిత చట్టం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లింగం, అంగన్‌వాడీ టీచర్ డి. లక్ష్మి, సఖీ కౌన్సెలర్లు తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి అంగన్‌వాడీలో మాట్లాడుతున్న జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి

మాదారంలో స్టోన్‌క్రషర్లకు అనుమతి ఇవ్వొద్దు

జిన్నారం, జూలై 2: మాదారం పరిధిలో నూతన స్టోన్‌క్రషర్లు, క్వారీలకు అనుమతి ఇవ్వొద్దని స్థానికులు ఆర్డీవోను కలిసి వినతి పత్రం అందజేశారు. మంగళవారం జిన్నారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆర్డీవో వసంతకుమారి, తహసీల్దార్ భిక్షపతిని మాదారం మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, నాయకులు రాజుగౌడ్, గణేష్, విజయ్‌గౌడ్ తదితరులు కలిశారు. ఇప్పటికే ఉన్న క్రషర్లతో తీవ్రంగా నష్టపోతున్నామని, కొత్త క్వారీల ఏర్పాటుకు అనుమతించవద్దని కోరారు. ఈ విషయమై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పరిశీలన జరిపి, నివేదిక ఇవ్వాలని ఆర్డీవో ఆదేశించారు.

రైతు సంక్షేమానికి కృషి చేస్తాం

- ఆత్మా కమిటీ చైర్మన్ ప్రభు

కొండాపూర్, జూలై 2: సంగారెడ్డి ఆత్మాకమిటీ చైర్మన్ ప్రభు తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలను తెలిపారు. మంగళవారం మల్కాపూర్ చౌరస్తాలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతులకు పంటసాగు మెళకువలు, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడం, శిక్షణ తరగతులను సబ్సిడీలపై అవగాహన కల్పిస్తామన్నారు.

ప్రతీ టీచర్‌ను రిలీవ్ చేయాలి

చిన్నశంకరంపేట, జూలై 2: ప్రతీ టీచర్‌ను రిలీవ్ చేయాలని ఎస్టీయూ అసోషియేట్ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మంగళవారం మండల విద్యావనరుల కేంద్రం వద్ద వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి ఉపాధ్యాయ బదిలీల కోసం ఎదురు చూస్తుండడంతో రిలీవింగ్‌లను ఆపి పాత పాఠశాలల్లో కొనసాగించడం అన్యాయమని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. వారి స్థానంలో విద్యావలంటీర్లను నియమించి బోధనకు ఆటంకం కలుగకుండా చూడాలన్నారు. వెంటనే టీచర్లను రిలీవ్ చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు హరిబాబు, టీపీటీఎఫ్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌జీటీయూ నాయకుడు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్

సంగారెడ్డి రూరల్, జులై 2: రోటరీ క్లబ్ ఆఫ్ మంజీరా సంగారెడ్డి అధ్యక్షుడిగా గోపన్నగారి చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంగారెడ్డిలో మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ మంజీరా సంగారెడ్డి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా నక్క రమేష్, కోశాధికారిగా సీహెచ్ అంజయ్యలను ఎన్నుకున్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా డాక్టర్లు రాజుగౌడ్, సత్యనారాయణ, ప్రభాకర్‌లను ఘనంగా సన్మానించారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి

నర్సాపూర్, జూలై 2: నర్సాపూర్ మండల పరిషత్ ప్రాంగణంలో ప్రొటోకాల్ పాటించకుండా తమకు కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా దుకాణ సముదాయాల నిర్మాణం, శంకుస్థాపన చేయడం ఎంతవరకు సమంజసమని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలనిజడ్పీటీసీ బబియానాయక్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు నర్సింగ్‌రావులు డిమాండు చేశారు. మంగళవారం సాయంత్రం జడ్పీటీసీ బబియానాయక్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు నర్సింగ్‌రావు, పలువురు ఎంపీటీసీలు విలేకరులతో మాట్లాడారు.

జహీరాబాద్‌లో ప్రజాప్రతినిధులకు వీడ్కోలు సమావేశం



ఎంపీపీ గిరిధర్‌రెడ్డిని సన్మానిస్తున్న జహీరాబాద్ ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

జహీరాబాద్, జూలై 2: గత ఐదేళ్ల కాలంగా మండల అభివృద్ధి విషయంలో సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఎంపీపీ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీలకు, జడ్పీటీసీలకు, మాజీ సర్పంచ్‌లకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జహీరాబాద్ మండలాన్ని వీలైనంతగా అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. అభివృద్ధి పనుల్లో అధికారులు, ఆయాగ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు తమకు సహకరించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మున్ముందు కూడ జహీరాబాద్ మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసుకుందామన్నారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నాగిశెట్టిరాథోడ్, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాములు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీడీవో మాధవరెడ్డి, కార్యాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి చేశా..

అల్లాదుర్గం, జూలై 2: ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకొని అధికారులు, ప్రజల సహకారంతో అభివృద్ధి సాధించానని అల్లాదుర్గం జడ్పీటీసీ సభ్యురాలు సౌందర్య పేర్కొన్నారు. జడ్పీటీసీ సభ్యుల పదవీకాలం ముగుస్తుండటంతో మంగళవారం మెదక్‌లోని జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు సౌందర్యకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హేమలతగౌడ్, నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి తదితరుల చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు.

గ్రామాల్లో రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

చేగుంట, జూలై 2: చేగుంట, నార్సింగి మండలాల్లో మంగళవారం వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు సమావేశాలు ఏర్పాటు చేసి రైతు భరోసాపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేసినట్టురామాయంపేట ఏడీఏ వసంతసుగుణ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేకరించిన అభిప్రాయాలపై ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి, నార్సింగ్ సొసైటీ చైర్మన్‌లు మేకల పరమేష్, శశిధర్ రెడ్డి, వ్యవసాయ అధికారి హరిప్రసాద్, రెడ్డిపల్లి సొసైటీ వైస్ చైర్మన్ ఆంజనేయులు, ఏఈవోలు దివ్య, విజృంభన, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

- కొడిపల్లి: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం మహ్మద్‌నగర్ సొసైటీ అధ్వర్యంలో రైతుభరోసాపై రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా సహకార ఆడిటింగ్ అధికారి కరుణాకర్ మాట్లాడుతూ.. రైతుల అభిప్రాయాలపై ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మహ్మద్ నగర్ సొసైటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ చిన్న చిన్నంరెడ్డి, సీఈవో దుర్గాగౌడ్ ఉన్నారు.



కౌడిపల్లిలో నిర్వహించిన అభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న మహ్మద్‌నగర్ సొసైటీ చైర్మన్

- చిలప్‌చెడ్: మండల పరిధిలోని సోమక్కపేట గ్రామంలో గల పీఏసీఎస్ కార్యాలయంవద్ద మంగళవారం రైతు భరోసాపై రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో బాల్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ రాంచంద్రారెడ్డి, జిల్లా సహకార ఆడిట్ అధికారి కరుణాకర్, ఏవో బాల్‌రెడ్డి, సిఈవో పోచయ్య రైతులు తదితరులు ఉన్నారు.

గుమ్మడిదల మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాం



అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తున్న ఎంపీపీ సద్ది ప్రవీణ, జడ్పీటీసీ కుమార్‌గౌడ్

గుమ్మడిదల, జూలై 2: గడిచిన ఐదేళ్ల కాలంలో గుమ్మడిదల మండలంలో రూ. కోట్లాది నిధులతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించినట్టు ఎంపీపీ సద్ది ప్రవీణ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎంపీపీ సద్ది ప్రవీణ భాస్కర్ రెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో మండల పరిషత్ కార్యాలయం భవనం తమ హయాంలో నిర్మించినందుకు గర్వంగా ఉందన్నారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధించామని తెలిపారు. పదవులు ఉన్నా, లేకపోయినా ప్రజా సమస్యల పరిష్కారానికి అండగా నిలుస్తామ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గౌరీ శంకర్ హౌస్సేన్ పలువురు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ రాస్తారోకో

జహీరాబాద్, జూలై 2: కాంగ్రెస్‌పార్టీ అధినేత రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని జహీరాబాద్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్ జగన్ విమర్శించారు. బీజేపీ అధిష్టానం పిలుపు మేరకు రాహుల్‌గాంధీ వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం పట్టణంలో రహదారిపై ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్‌లో హిందూ దేవతలను, హిందువులను అవమానిస్తూ చేసిన ఘాటు వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. రాహుల్‌గాంధీ యావత్ హిందూ సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. రహదారిపై బైఠాయించిన క్రమంలో బీజేపీనాయకులు, కార్యకర్తల, పోలీసుల మధ్య కాసేపు తోపులాట జరిగింది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు మల్లిఖార్జున్‌పాటిల్, సుధీర్‌బండారీ, శ్రీనివాస్‌గౌడ్, బక్కయ్యగుప్తా, శ్రీనివాస్‌గుప్తా, జనార్దన్‌రెడ్డి, విశ్వనాథ్‌స్వామి, వైద్యనాథ్, ఓంకార్‌యాదవ్, శ్రీకాంత్, దుర్గయ్య, కిష్టన్న, పూలసంతోష్, అప్పం శ్రవణ్, క్రిష్టారెడ్డి, రాఘవేందర్‌నాయక్, అరుణ్, వెంకట్ పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నిరుద్యోగులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

- బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళనలు

మెదక్ అర్బన్, జూలై 2: ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగలను మోసం చేస్తుందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్‌పటేల్ ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యపు వైఖరిని వ్యతిరేకిస్తూ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పరీక్ష తేదీలను మార్చాలన్నారు. అన్ని నియామకాల్లో మహిళా అభ్యర్థులకు 33 శాతం రిజర్వేషన్ కేటాయించాలన్నారు. జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలన్నారు. గ్రూప్ 2, 3 నోటిఫికేషన్‌లలో అదనంగా పోస్టులను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, జిల్లా ఉపాధ్యక్షుడు రాహుల్, నాయకులు రాజు, అశోక్, బాబు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక న్యూ బస్టాండ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేస్తామని చెప్పి 11వేల మాత్రమే భర్తీ చేస్తామని చెప్పడం దారుణమన్నారు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో అభ్యర్థుల షార్ట్ లిస్టు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసి, అభ్యర్థులను షార్ట్ లిస్ట్ తయారు చేయాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

- తూప్రాన్: నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు తూప్రాన్ తహసీల్దారు కార్యాలయం ముందు బీజేవైఎం, బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ విజయలక్ష్మికి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.



మెదక్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్ పటేల్

- నారాయణఖేడ్: నిరుద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం బీజేవైఎం నాయకులు ఖేడ్ తహసీల్దార్ భాస్కర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ డీఎస్సీ పరిక్షా తేదీలను వాయిదావేసి, మెగా డీఎస్సీని నిర్వహించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఖేడ్ మండల బీజేవైఎం అధ్యక్షులు బూమ్‌రాజ్, నాయకులు పట్నంమాణిక్, పండరి, ప్రశాంత్‌గౌడ్, తదితరులు ఉన్నారు.
- నాగల్‌గిద్ద: రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు రమేష్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి ఇన్‌చార్జి తహసీల్దార్ అబ్దుల్ మాగ్నీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగొశెట్టిపాటిల్, పుండ్లిక్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ సహజం



సంగారెడ్డిలో విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు, ఉద్యోగులు

సంగారెడ్డి రూరల్, జూలై 2: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులతో పాటు పదవీవిరమణ కూడా సహజమేనని ట్రాన్స్‌కో ఎస్ఈ మాధవరెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డిలో మంగళవారం విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సారా ప్రభాకర్‌గౌడ్ పదవీ విరమణ సందర్భంగా వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖలో ప్రభాకర్‌గౌడ్ గత 44 యేళ్లుగా ఎనలేని సేవలందించారని, అటు ఉద్యోగాన్ని, ఇటు విద్యుత్‌శాఖ ఉద్యోగుల హక్కుల కోసం ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఉద్యోగికి ఘనంగా వీడ్కోలు



చిన్నశంకరంపేట ఇరిగేషన్ ఆఫీసులో ఎడ్ల సత్తయ్య దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

చిన్నశంకరంపేట, జూలై 2: ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్ పేర్కొన్నారు. కామారం గ్రామానికి చెందిన ఇరిగేషన్ లత్కర్ ఎడ్ల సత్తయ్య పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయంలో డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీఎన్జీవో అధ్యక్షుడు నరేందర్ పదవీ విరమణ పొందిన సత్తయ్య యాదమ్మ దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సత్తయ్య అంకిత భావంతో పనిచేశారని తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ ప్రదీప్, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వరయ్య, లక్ష్మణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎంపీపీ

జిన్నారం, జూలై 2: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ఎంపీపీ రవీందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం గడ్డపోతారం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రాఘవయ్య పదవీ విరమణ సందర్భంగా ఎంపీపీ రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ ప్రకాశంచారి, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

బదిలీపై వెళ్తున్న టీచర్లకు సన్మానం



బదిలీపై వెళ్తున్న టీచర్లను సన్మానిస్తున్న దృశ్యం

వెల్దుర్తి, జూలై 2: మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న టీచర్లను మంగళవారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో పనిచేసిన 14మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య తెలిపారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్

హత్నూర, జూలై 2: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. మంగళవారం శిశు సంక్షేమశాఖ, మహిళా సాధికారత కేంద్రం, బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో దౌల్తాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో న్యాయ చట్టాలపై సంయుక్త అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయధికారి రమేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. విద్యార్థులందరూ మహిళా చట్టాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా మూడు కొత్త చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం చట్టాలను గురించి వివరించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి రత్నం మాట్లాడుతూ బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బాల్య వివాహాలు, బాల్య వివాహ నిషేద చట్టం గురించి తెలియజేశారు, బాలలకు ఎలాంటి సమస్యలు వచ్చినా 1098 చైల్డ్ లైన్‌కి ఫోన్ చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ పల్లవి, ఏఎస్ఐ దుర్గయ్య, కళాశాల ప్రిన్సిపాల్ స్వామి, యాదగిరి, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయిలతో జీవితాలు నాశనం: ఆర్డీవో

తూప్రాన్, జూలై 2: డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాలు జీవితాలను నాశనం చేస్తాయని, వాటి జోలికి పోవద్దని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సూచించారు. మంగళవారం తూప్రాన్ పట్టణ పరిధి రావెల్లి శివారులోని మహాత్మాజ్యోతిబా పూలే బాలికల (నర్సాపూర్) గురుకుల పాఠశాలలో అవగాహన చేపట్టారు. విద్యార్థునులు, ఉపాధ్యాయ బృందానికి వేర్వేరుగా సమావేశం నిర్వహించి మత్తు వ్యసనాలపై కౌన్సెలింగ్ నిర్వహించారు. యువత డ్రగ్స్‌కు అలవాటు కాకుండా నిలువరించే సూచనలు, మెలుకువలను సూచించారు.

కులసంఘాల భవనాలను సద్వినియోగం చేసుకోవాలి



తిమ్మాపూర్‌లో ముదిరాజ్ సంఘ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునితారెడ్డి

కొడిపల్లి, జూలై 2: కుల సంఘాల భవనాలను సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని సీడీఎఫ్ నిధులతో తిమ్మాపూర్‌లో రూ.9 లక్షలతో గౌడ సంఘం, రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన ముదిరాజ్ సంఘాల భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ రాజు నాయక్, జడ్పీటీసీ కవితాఅమర్‌సింగ్, ఎంపీడీవో శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సార రామాగౌడ్, ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు ఉప్పరి సత్తయ్య ముదిరాజ్, ఎంపీటీసీ స్వప్నాకిషోర్‌గౌడ్, గ్రామ ప్రత్యేక అధికారి జగన్నాథం, పీఆర్ డీఈ అమరేశ్వర్ తదితరులు ఉన్నారు.

బోనాల పండుగకు మంత్రులకు ఆహ్వానం

తూప్రాన్, జూలై 2: గోల్కొండ కోటలో వెలసిన శ్రీజగదాంబిక ఎల్లమ్మ తల్లికి ఈ నెల 7న కుమ్మర్ల తొలి బోనం సమర్పించడానికి దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌లను మంగళవారం ఆహ్వానించినట్లు తెలంగాణ కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మరి బాలకృష్ణ ప్రజాపతి తెలిపారు. తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ గ్రామానికి చెందిన బాలకృష్ణ తొలి బోనం సమర్పణలో కుమ్మరులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నట్లు వివరించారు.

నీటి ఎద్దడి నివారణకు 5 మినీ రిజర్వాయర్లు

పటాన్‌చెరు, జులై 2: అమీన్‌పూర్ పట్టణంలో మంచినీటి ఎద్దడి నివారణకు మిషన్ భగీరథ పథకం ద్వారా ఐదు మినీ రిజర్వాయర్ల నిర్మాణం పూర్తి చేశామని, త్వరలోనే అందుబాటులోకి తేనున్నట్లు మున్సిపల్ చైర్మన్ తుమ్మలపాండురంగారెడ్డి తెలిపారు. మంగళవారం మెట్రోవాటర్‌వర్క్స్ సిబ్బందితో మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. నీటి ఎద్దడిపై ఇటీవల తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీక్షా సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, మెట్రోవాటర్ వర్క్స్ ఏఈ అమీరొద్దీన్, మున్సిపల్ రెవెన్యూ అధికారి వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ కళాశాల, పాఠశాల పనితీరు భేష్

జహీరాబాద్, జూలై 2: నిరుపేద విద్యార్థుల ప్రయోజనార్థం ఏర్పాటు చేసిన మైనార్టీ కళాశాల, పాఠశాల పనితీరు అభినందనీయమని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ జీఎం జుబేదాబేగం, మేనేజర్ జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అల్గోల్ గ్రామంలో గల మైనార్టీ గురుకుల కళాశాల, పాఠశాలను వారు సందర్శించారు. కళాశాలకు వచ్చిన ఉన్నతాధికారులకు స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ జమీల్, రాములు తదితరులు కళాశాల కొనసాగింపు, వసతులు, విద్యాభివృద్ధి, ఫలితాలు తదితర అంశాలపై క్లుప్తంగా వివరించారు. కళాశాల, పాఠశాలలో ఏమైనా సమస్యలుంటే ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని వారు ప్రిన్సిపాల్, అధ్యాపక బృందానికి చెప్పారు. అనంతరం కళాశాలలో, పాఠశాలలో కలియదిరిగి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా డీఎండబ్ల్యూవో దేవుజ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు రాక పంచాయతీ సిబ్బంది ఇక్కట్లు

కంది, జూలై 2: మూడు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నాం...మాకు జీతాలు ఇప్పించండి సారూ! అని కంది గ్రామ పంచాయతీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కంది గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ఆంధ్రజ్యోతితో తమ గోడును వెళ్లబోసుకున్నారు. జిల్లా ఉన్నతాధికారులు కల్పించుకుని తమకు వెంటనే మూడు నెలలకు సంబంధించిన వేతనాలు ఇప్పించాలని పంచాయతీ సిబ్బంది కోరారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

సంగారెడ్డి రూరల్, జులై 2: ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు డీఈవో కార్యాలయంలో డీఈ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు.

రెడ్ క్రాస్ ఆరోగ్య శిబిరానికి అపూర్వ స్పందన

మెదక్ అర్బన్, జూలై 2: మెదక్‌లో మంగళవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరంలో 146 మందిని వైద్యులు పరీక్షించారు. రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ నిర్వహణలో మేడ్చల్ మెడిసిటీ ప్రత్యేక వైద్య నిపుణులు చేరుకుని రోగులను పరీక్షించి, మందులను ఉచితంగా అందజేశారు. కాగా ఈ శిబిరాన్ని రెడ్ క్రాస్ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ప్రారంభించారు.